క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాబూరావు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం బాబూరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని, మద్దతు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వీఓ అధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, సీసీ మహేందర్, మహిళా సంఘ సభ్యురాలు వెంకటవ్వ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సంపూర్ణ జ్ఞానం

ఎంఈఓ దేశిరెడ్డి



నృత్యం చేస్తున్న చిన్నారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే సంపూర్ణ జ్ఞానం లభిస్తుందని.. తద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. ఆదివారం చిన్నకోడూరు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువే అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సంఘం భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా అనేక రకాల బకాయిలు రాక విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నిరకాల వ్యాధులకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి, నాయకులు రాజిరెడ్డి, బాలయ్య, భూంరెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండుగను ఆనందంగా జరుపుకోవాలి



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ముస్లిం పెద్దలు

మిరుదొడ్డి(దుబ్బాక): రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని దుబ్బాక నియోజకవర్గం మజీద్ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎండీ జాకీర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ముస్లిం పెద్దలు డా.వాహెద్ హుస్సేన్, మహ్మద్ సాహెబ్ హుస్సేన్, శాకెర్ అహ్మద్, ఇస్మాయిల్, రహమాన్, అజం మోసిన్ సహకారంతో ఆదివారం మిరుదొడ్డిలోని మజీద్ వద్ద ఆయా గ్రామాలకు చెందిన ముస్లింలకు దుస్తులు, నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు సుమారు రూ.90వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేద ముస్లిం కుటుంబాలు పండును ఆనందంగా జరుపుకోవడానికి తాము సంపాదించిన దాంట్లో కొంత బాగాన్ని నిరుపేదలకు (జకాత్) పంచిపెట్టడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో మాజీ కో అప్షన్ మెంబర్ ఎండీ హుస్సేన్, మత పెద్దలు జానీ, మునీర్, అహ్మద్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే అభివృద్ధి సాధ్యం

బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



ములుగు(గజ్వేల్): మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ఖీటములుగు(గజ్వేల్): గ్రామాల అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవరం రఘునందన్‌రావు అన్నారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయడంతోనే నేడు గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని చెప్పారు. బీజేపీ గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, సురేష్‌గౌడ్, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆశీర్వదించాలి..

కొండపాక(గజ్వేల్): దేశ సార్వభౌమాధికారాన్ని పెంచేలా పని చేస్తున్న బీజేపీని ప్రజలు ఆశీర్వదించాలని రఘునందన్‌రావు కోరారు. కుకునూరుపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ రక్షణ కోసం ప్రధాని అవలంభిస్తున్న పనితీరులను ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, గురువారెడ్డి, జశ్వంత్‌రెడ్డి, భైరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఎంపీ అభ్యర్థులు కరువు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు కరువయ్యారని, టిక్కెట్ దక్కిన వారు కూడా పార్టీని వీడుతున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. ఆదివారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. 20 ఏళ్ల చరిత్ర కలిగిన బీఆర్‌ఎస్‌కు మెదక్ జిల్లా అభ్యర్థి దొరకలేదా, 125 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌కు జిల్లా వాసి దొరకలేదా అని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని ఏద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకే ఐదుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారని ఆరోపించారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. మెదక్‌లో బీజేపీ గెలువడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎల్లు రాంరెడ్డి, ప్రసాద్‌రావు, గురువారెడ్డి, రాములు, మండలాధ్యక్షుడు ఐలయ్యాయాదవ్, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, మల్లేశం, బాల్‌రాజు, సాయిబాబా, సుధాకర్, వెంకటేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం..

గజ్వేల్‌రూరల్: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం ఖాయమని రఘునందన్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎం మిషన్లను టాంపరింగ్ చేసు కొని నరేంద్రమోదీ గెలుపొందారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మనోహర్‌యాదవ్, పంజాల అశోక్, కప్పర ప్రసాదరావు, కుడిక్యాల రాములు తదితరులు పాల్గొన్నారు.

‘నవోదయ’లో విద్యార్థుల ప్రతిభ



నిశాంత్



సింధుశ్రీ

వర్గల్(గజ్వేల్): నవోదయ ప్రవేశ పరీక్షలో మండలం తున్కిఖాల్సా ప్రాథమిక పాఠశాల విద్యార్థి కొండగల్ల నిశాంత్ ప్రతిభ చాటాడు. ఆరో తరగతి ప్రవేశం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలో సత్తాచాటాడు. విద్యార్థిని హెచ్ఎం కృష్ణమోహన్‌రావు, ఉపాధ్యాయులు నాగరాజు, పులి రాజు, మంజులా రెడ్డి, విమల, శిరీష అభినందించారు.

రెడ్యానాయక్‌తండా విద్యార్థి

మద్దూరు(ముస్నాబాద్): జవహర్ నవోదయ విద్యాలయం 2024–25 విద్యాసంవత్సరానికి నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో దూల్మిట్ట మండలంలోని రెడ్యానాయక్‌తండాకు చెందిన ధరావత్ సాంధుశ్రీ ఎంపికైనట్లు ఆదివారం తెలిపారు. సింధుశ్రీని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గాగిల్లాపూర్ విద్యార్థి..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన దశనం శ్రీకర్ ఉమ్మడి కరీంనగర్‌లోని చొప్పదండి నవోదయ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించాడు.

మత్స్యకారులకు సభ్యత్వం అవసరం

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లోని మత్స్యకారులందరికీ సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వాలని ముదిరాజ్ సంఘం మండల మహాసభ అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో జనాభా పెరగడం వల్ల చెరువుల విస్తీర్ణం నిబంధనలను సడలించి అందరికీ చేపలు పట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. మార్కెటింగ్ సొసైటీలను ఏర్పాటుచేసి చేపలు మార్కెట్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు.

జర్నలిస్టు అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన జర్నలిస్టు అసోసియేషన్ కార్యవర్గం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడుగా బందారం గ్రామానికి చెందిన నిమ్మ నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడు మర్పడ్గ జగన్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా జంజరపు సంజీవ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

‘పూర్వ’ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): వారంతా 1984–85బ్యాచ్‌ టెన్త్ విద్యార్థులు. మండల పరిధిలోని చెప్యాలలో చదువుకున్నారు. సరిగ్గా 40 సంవత్సరాల తరువాత ఒకే చోట కలుసుకోవాలనుకున్నారు. చెప్యాల ఉన్నత పాఠశాలలో కలిశారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చదువుకున్న రోజులను గుర్తుచేసుకుని సందడి చేశారు.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఉత్సాహంగా కల్చర్ కార్నివాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలోని మెరీడియన్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, రాజా వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, సౌజన్య తదితరులు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. చిన్నారులు వివిధ వేషధారణ, నృత్యాలతో అందరినీ అలరించారు.

రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సిద్దిపేటకమాన్: రాజ్యాంగ రక్షణ యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ యాత్ర 2న అలంపూర్ గద్వాల్‌లో ప్రారంభమై 8న గ్రేటర్ హైదరాబాద్ మేడ్చెల్‌లో ముగుస్తుందన్నారు. ముగింపు సభలో అధిక సంఖ్యలో బహుజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, మల్లికార్జున్, సత్యనారాయణ, అరుణ్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరి పంట దగ్ధం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ గ్రామంలో ప్రమాదవశాస్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వరి పొలం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన హనుమాండ్ల రామిరెడ్డికి చెందిన వరి పంట షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.





టాలెంట్ హంట్‌లో పాల్గొన్న చిన్నారులు

టాలెంట్ హంట్‌కు 60 మంది విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికిగాను టాలెంట్ హంట్ నిర్వహించినట్లు ఆ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మైనార్టీ బాలుర పాఠశాలలో ఆదివారం జిల్లా యువజన క్రీడాధికారి, మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ సహకారంతో ఫుట్‌బాల్ టాలెంట్ హంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ పోటీలో ప్రతిభ కనబర్చిన వారికి మరింత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ నర్సింహులు, ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు రమేష్, గణేష్, సుగుణాకర్, చక్రపాణి, శ్రీధర్, ఎల్లయ్య, కిరణ్‌సాగర్, విఠల్, బాలబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



దుబ్బాకటౌన్: చెరకు శ్రీనివాస్ రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ గంగరాజు

దుబ్బాకటౌన్: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీల్లో భాగంగా ఆదివారం ధర్మాజీపేట శివారులో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్ రెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ గంగరాజు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దుబ్బాక మండల వ్యాప్తంగా నిత్యం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఎవరూ సరైన ఆధారాలు లేకుండా రూ. 50 వేలకన్నా ఎక్కువ నగదు తీసుకెళ్తే నిబంధనల ప్రకారం సీజ్ చేస్తామన్నారు.

రాయపోలు(దుబ్బాక)లో..

రాయపోలు పోలీసులు ఆదివారం మధ్యాహ్నం గజ్వేల్–చేగుంట రహదారిపై వీరానగర్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధలను పాటించాలని ఎస్ఐ రఘుపతి పిలుపునిచ్చారు.

కోడ్ అములులో లేదా?

దర్శనమిస్తున్న మోదీ ఫ్లెక్సీ

మద్దూరు(హుస్నాబాద్): ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్‌లకు ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ మండలంలోని లద్నూర్ గ్రామంలో ప్రధాని మోదీ ఫ్లెక్సీతోపాటు వివిధ పార్టీల జెండాలు అలాగే దర్శమిస్తున్నాయి. ఈ గ్రామం మద్దూరు నుంచి జనగామ వెళ్లే ప్రధాన రహదారిలో ఉంది. దానికి తోడు ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ ఉన్నారు. దీంతో మండలంలో ఎన్నికల కోడ్ అములులోన్న అధికారుల పట్టింపులేదని విమర్శలు వెల్లువెత్తున్నాయి. వెంటనే ఎన్నికల అధికారులు స్పందించి రాజకీయ నేతల ఫ్లెక్సీలు, జెండాలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



లద్నూర్‌లో దర్శనమిస్తున్న మోదీ ఫ్లెక్సీ

భక్తి శ్రద్ధలతో కోటి తలంబ్రాల దీక్ష



కోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వర్గల్(గజ్వేల్): శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో శనివారం రాత్రి వర్గల్ మండలం చాంద్ఖాన్ మక్త వేదికగా కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో గ్రామస్తులు భాగస్వాములయ్యారు. దీక్షా ప్రాంగణంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సామూహిక రామనామ స్మరణ జరిపించగా భక్తులు వడ్లను గోటితో ఒలుస్తూ తలంబ్రాలను సిద్ధం చేశారు. భద్రాచల సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు తయారుచేసే అవకాశం లభించడం అదృష్టంగా గ్రామస్తులు పేర్కొన్నారు. రెండు గంటలపాటు కొనసాగిన ఈ కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా రామరాజును గ్రామ ప్రముఖులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సజ్జనిత భిక్షపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నీలకంటయ్య, కో ఆపరేటివ్ డైరెక్టర్ పద్మారెడ్డి, నారమైన బాబు, కృష్ణ, సత్తయ్య, సత్తయ్య, అశోక్, డీలర్ లావణ్య, వార్డు మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు దిగుతూ.. జారి పడి

వృద్ధుడి మృతి



కనకయ్య (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఆర్టీసీ బస్సు నుంచి దిగుతూ జారిపడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు ఎస్ఐ దామోదర్ కథనం ప్రకారం.. పట్టణ శివారు యాదవ నగర్‌కు చెందిన ఎస్.కనకయ్య(62) శనివారం గజ్వేల్‌లో ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లి అక్కడి నుంచి రాత్రికి చేర్యాలకు వెళ్లాడు. అయితే బస్సు దిగుతూ జారి కింద పడి తలకు గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని.. ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

కొమురవెల్లి(సిద్దిపేట): బైక్‌పై కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన కొమురవెల్లిలో చోటు చేసుకుంది. మండలం నాంచరుపల్లికి చెందిన జిడ్డి రమేశ్ ఆదివారం మల్లన్న దర్శనానికి వెళ్లి వస్తూండగా పాత కమాన్ సమీపంలో కారు ఢీ కొట్టింది. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

గజ్వేల్‌రూరల్: జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడిచేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడిచేయగా 10 మందిని పట్టుకుని వారి నుంచి రూ.23,860 నగదుతో పాటు 10 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే ఈ నంబర్లకు 87126–67447, 87126–67446 సమాచారం అందజేయాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

గజ్వేల్: సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలను చూరగొనాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఆకాంక్షించారు. ఆదివారం గజ్వేల్‌లో వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జగ్గయ్యగారి శేఖర్ ఆధ్వర్యంలో పంచాంగం ఆవిష్కరణ, గో సేవ, పులిహోర పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. పాల్గొన్న రాజమౌళి మాట్లాడుతూ కొత్త కార్యవర్గం సేవ కార్యక్రమాల్లో తమదైన ముద్ర వేసుకోవాలన్నారు. కార్యక్రమంలోక్లబ్ నవీన్, వెంకటేశం పట్టణ ప్రముఖులు ఎర్రం శ్రీనివాస్, మెట్టయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెంపొందుతుందని విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి జిల్లా అధ్యక్షురాలు రాగి రాధ అన్నారు. ఆదివారం చిన్నకోడూరులో విశ్వహిందూ పరిషత్, మాతృశక్తి, దుర్గావాహిని నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మురళీ, అనిల్, శ్రీనివాస్, పోశినాథం, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ భక్తులపై టెండర్‌దారుల దాడులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులపై సెల్‌ఫోన్, పాదరక్షల టెండర్ దారుల దాడులు కొనసాగుతున్నాయని, పట్టించుకోవాల్సి అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిబ్రవరి 7న హన్మకొండకు చెందిన భక్తుడిపై టెండర్‌దారుడు దాడి చేశాడు. ఈ ఘటన మరువకముందే శనివారం పాదరక్షలు భద్రపరుచుకునే టెండర్ దారుడు షాద్ నగర్‌కు చెందిన భక్తులపై ఇనుపరాడ్‌తో దాడి చేయడం స్థానికంగా చర్చనీయంశంగా మారింది. ఆలయ అధికారులు స్పందించి భవిష్యత్తులో భక్తులపై దాడులు జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

◆ ఘనంగా పోచమ్మ బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేట కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామ వీధుల గుండా పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గ నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): బీఎస్‌పీ మాన కొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని రేగులపల్లె గ్రామానికి చెందిన మాతంగి తిరుపతిని నియమించినట్లు ఆ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో 18 సంవత్సరాలుగా పని చేస్తున్న తిరుపతికి నియోజకవర్గ అధ్యక్ష బాధ్యతలు ఇచ్చిందుకు పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తొగుట(దుబ్బాక): స్థానిక సీతారామాంజనేయ స్వామి దేవాలయ 15వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుతారి లలితరమేష్, తిరుపతి, దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి సతీమణి విజయమ్మ, మాజీ సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ ఇంటింటా ప్రచారం

తొగుట(దుబ్బాక): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన లాభర్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాన్గల్‌లో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటువేసి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు స్వామి, ప్రవీణ్, ఎల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారులు, గృహ యజమానులు తమ ఆస్తిపన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పిలుపునిచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌కు సంబంధించిన పన్ను రూ. 4,75,878, బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి సంబంధించిన పన్ను రూ. 10,46,644 వసూలు చేయడం జరిగిందన్నారు.

◆ ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

గజ్వేల్: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన శివగల్ల మధుకృష్ణకు మిత్రులు అండగా నిలిచారు. ఆదివారం అతడి వైద్య ఖర్చుల నిమిత్తం గ్రామ బీజేపీ అధ్యక్షుడు గుండారం నవీన్, నాయకులు పాపయ్యగారి శ్యామ్‌కుమార్ రూ.5వేల సాయం అందించారు.

హెల్త్ సబ్‌సెంటర్‌కు పవర్ కట్

దుబ్బాకరూరల్: హబ్సీపూర్ హెల్త్ సబ్ సెంటర్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. మూడు సంవత్సరాల నుంచి రూ.20వేలు బిల్లు పెండింగ్‌లో ఉండడంతో అధికారులు నిలిపివేశారని, దీంతో తమకు ఇబ్బంది కరంగా మారిందని రోగులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరాను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

◆ నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మిరుదొడ్డి(దుబ్బాక): మండలంలోని ధర్మారం గ్రామంతో పాటు, అక్బర్‌పేట–భూంపల్లిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఐకేపీ ఏపీఎం కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183కు విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.